# ఎదవసచ్చినోడు!

పోలిగాడు పట్టి తాగుబోతు. నిద్ర లేచింది మొదలు రాత్రిళ్లు నిద్రపోయే వరకు మత్తులో మైకంలో వుండాల్సిందే! మనిషి దర్భ పుల్లలావున్నా... పీకల దాకా తాగాల్సిందే! తాగనిదే తోచదు. తన పన్లు తాను చేసుకోలేడు.

పోలిగాడి చేత తాగుడు మాన్పించటం వాడి పెళ్లాం వల్ల కాలేదు. అది మట్టి తట్టలు మోసి ఇళ్లల్లో పాచిపని చేసి కడుపున పుట్టిన పిల్లలను పోషించటం రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా... పోలిగాడికి పట్టదు.

కష్టపడటానికి వొళ్లు వంగదు. పెళ్లాం తెచ్చేదాంట్లో వాటాకోసం దాన్ని చావబాదతాడు. ఎంత మొత్తుకున్నా వినడు! అదేమంటే... ఓ పదిరోజులు ఎటోవెళ్లి పోతాడు. పెళ్ళాం గుర్తు కొస్తే మళ్లీ ఇల్లు చేరుకుంటాడు.

చేతినిండా డబ్బులు లేకపోతే... జేబులు కొడతాడు... పిల్లలను ఎత్తుకుపోతాడు. వాళ్లని అమ్మిన డబ్బుతో జల్సా చేసుకుంటాడు. ఎదవ సావాసాలు మరిగి మనిషి పూర్తిగ చెడిపోయాడు.

కన్న నేరానికి యాదమ్మే నలుగురు ఆడపిల్లలను సాకాల్సిన బాధ్యత నెత్తినపడింది. పెద్ద పిల్లకు పన్నెండేళ్లు! ఓప్లీడరు గారింట్లో పాచిపనికి పెట్టింది. వాళ్లు పిల్లదానికి రెండుపూటలా తిండిపెట్టి నెలకు అయిదొందలిస్తారు. రెండో పిల మూగది. మాట పలుకు వుండదు. ఆకలేస్తుందని కూడా చెప్పలేదు. అది చేసే సైగలు అర్థం చేసుకుని దాని కంచంలో ఇంత బువ్వ కలిపిపడేస్తుంది.

మూడోపిల్ల కంత్రీ! అన్నీ అయ్యపోలికలే దానికొచ్చిన యాదమ్మ తిట్టి పోస్తుంటుంది. కడగొట్టు పిల్ల రెండేళ్లది. దానికింకా పాలు మాన్పించకపోవటాన పనిలోకి వెడుతూ వెంట తీసుకుపోతుంది.

మొగుడు చేస్తున్న ఎదవ పన్ల గురించి కర్ణాకర్ణికగా యాదమ్మకు తెలీటంతో ఒక రోజున మొగుడ్ని నిలదీసింది.

'నీకిదేంపోయే కాలం? కాళ్లూ చేతులు బాగానే వుండగా కష్టపడి పని చేసుకుని పది డబ్బులు సంపాదించక... ఇట్టాంటి ఎదవపన్లు చేత్తావెందుకయ్యా?- పోలీసోళ్ల కంట్లో గనక పడ్డావంటే... నిన్ను కుళ్ల బొడుస్తారు. జైల్లో కూకోబెడతారు. అప్పుడు గానీ నీ రోగం కుదర్దు...' మొగుడ్ని చీవాట్లు పెట్టింది.

'నువ్ నోర్మూయెహె! నువ్ బువ్వెట్టవ్... నాపని నన్ను సేసుకోనీయవు... నువ్విట్టా వాగితే అసలు ఇంటి కేరాను. నిన్ను ఏలుకోను...'

'నన్నేలుకోకున్నా పర్వాలేదయ్యా? నలుగురు ఆడపిల్లలను కన్నావ్?- ఆళ్ల నేంచేస్తావ్. తండ్రిగా వాళ్ల బాగోగులు నీకు పట్టవా? వాళ్లకింత తిండి పెట్టాలనే ఆలోచనే లేదా?-'

'నువ్వు కట్టపడి పిల్లల్ని సాకుతుండగ... ఇక నాకేం దిగులే?-'

'ఛీ! నీ బతుకు సెడ! నువ్వూ ఒక మగాడివేనా?-ఎక్కడా ఏమీ దొరక్కుంటే కూటి కోసం నాకాడికొత్తావ్... లేకుంటే నేను పిల్లలు గుర్తుకురామా?-'

'గుర్తుండబట్టేగద అప్పుడప్పుడైనా వచ్చి తొంగి సూసిపోతావుంది.! ఇంటి కొస్తే చాలు... ఒకటే సోది... ఎదవ గోడవ!- నా గురించి నాబాగోగుల గురించి మాటాడవ్. నీకు పట్టదు. వత్తే చాలు ఏం సంపాదిస్తున్నవ్? ఎంత సంపాదిస్తుండావ్ అంటూ శతకోటి కొచ్చన్లు- ఇంద? ఈ వంద నవ్వుంచుకో. ఈ పూట కోడిని కోసి చేపల పులుసొండు. ఇయ్యాళ రేపు నామకాం ఇంటికాడనే...' గుడిసె దగ్గర్లో వేప చెట్టు కిందున్న కుక్కిమంచంలో పండినాడు.

మొగుడు పండిన మంచాకాడికి వెళ్లిన యాదమ్మ 'అదిగాదయ్యా... ఈ పాడు పనులు' చేసి అందరి చేత 'ఛీ' అనిపించుకోకపోతే... హాయిగా రిచ్చా తొక్కుకుని సంపాదించుకోరాదూ?-'

'నీయమ్మ... నాకు నీతులు సెప్ప మాకు... నాకు చెడ్డ చిరాకు!... హాయిగ సుకంగా బతికేటోడికి కట్టపడే పన్లు చెప్పొద్దు!- రిచ్చాతోక్కే శక్తి లేదు నాకు. పైగా ఈరోజుల్లో ఆటోరిచ్చాలే గాని మడుసులు తొక్కే సైకిలు రిచ్ఛాలెక్కడియే?...'

'పోనీ ఆటో నడపటం నేర్చుకోరాదంటయ్యా. వంటికి శ్రమలేకుండా బోలెడు సంపాదించవచ్చు!...'

'ఎల్లెహె! ముందు బువ్వండు! నేనెట్టా సంపాదించాలో నాకు తెలవదా ఏంది?- నేను కట్టపడకపోతే నీకిచ్చిన ఆ వందరూపాయలు యాడనుంచి వచ్చినయ్యే... కసురుకున్నాడు పెళ్లాన్ని

యాదమ్మ ముఖం చిట్లించుకుని గుడిసెలోకెళ్లింది

× × × × ×

సారాయాపారం సెయ్యాలంటే పర్మిట్టో... లైసెన్సో వుండాలని గాని

తాగటానికి వాటితో పన్లేదు చేతిలో డబ్బులుంటే చాలు! కోరిన సరకు కాళ్లకాడికి లగెత్తకొస్తది.

పోలిగాడు కాస్తోకూస్తో తాగడు. వాడు తాగి వీధుల్లో అడ్డదిడ్డంగ వంకర్లు తిరిగిపోతూ నడుస్తుంటే... వంటిన పంచ వుందో లేదో గమనం లేనంతగా తాగుతాడు. లేకపోతే వాడికి తృప్తిగా వుండదు. ఏకారో లారీనో గుద్దుతుందనే భయం లేదు.

పెళ్లాం వండుతున్న కోడి పలావు ఘుమఘుమలు నాసికాపుటాలకు సోకుతూంటే.. గొంతు తడుపుకోను ఆరాటపడి దగ్గర్లో వున్న సారాయి దుకాణాన్ని చేరుకుని రెండు మూడు ప్యాకెట్లు తాగి తిండి కోసం గుడిసె చేరుకున్నాడు.

కడుపునిండ భరీగతిని వెల్లకిల నులక మంచంలో పడుక్ను పోలిగాడి బుర్రలో అనేకానేక ఆలోచన్లు. చేతిలో పైసలు కరుసైపోయినయ్- మళ్లీ డబ్బులు కోసం వేట మొదలుపెట్టాలి! ఇకనుంచి ఆడోళ్ల మెడలో మంగళసూత్రాలు తెంపుకులగెత్తటానికి... డబ్బున్నోళ్ల జేబులు కత్తిరించటానికి మనస్కరించటం లేదు. ఎంత కట్టపడినా చేతినిండా డబ్బు వుండదు.

పిల్లలను ఎత్తుకుపోయి అమ్మటమే శానా మంచిదన్పించింది. ఆదాయం వేలల్లో లచ్చల్లో ఉంటుంది. మగపిల్లలు కంటే ఆడపిల్లల నమ్మితే రెట్టింపు ఆదాయం వుంటుంది. అందునా మాటలు రాని వయసు పిల్లలైతే ఇంకా మంచిది. చిన్న పిల్లలను ఎత్తుకెళ్ళటం చాలా తేలిక! ఏడిస్తే నోరు మూసి దూరంగ తీసుకెళ్లి బిస్కెట్లు కొనిచ్చి మచ్చిక చేసుకోవటం వీజీ!

వీధులంబటి తిరిగి నాలుగైదు ఏళ్ల వయసు లోపు పిల్లల కోసం వేట మొదలుపెట్టాడు పోలిగాడు. ఇళ్లముందుగాని... 'ప్లే'స్కూల్లో గానీ తేలిగ్గా దొరుకుతారన్పించింది.

పిల్లల 'ప్లే'యిస్కూల్లో సీపరుగ పనిచేసే కోటమ్మతో పరిచయం పెరిగింది. కోటమ్మకు కారాకిళ్లీ నమిలే అలవాటుందని గ్రహించి కల్సినప్పుడల్లా ఓనాలుగు కారాకిళ్లీలు కొని తీసుకెళ్లి ఇస్తున్నాడు. ఎండ తీవ్రంగా వున్న రోజున డబ్బు కరుసను కోకుండా కూల్‌డ్రింకూ ఇప్పిస్తున్నాడు.

కోటమ్మ ద్వారా ప్లేస్కూల్లో చిన్న పిల్లలను సంపాదించ వీలవుతుందని.. ఒక్కో పిల్లవాడికో... పిల్లదానికో తనకొచ్చే సొమ్ములో కొంత ఇచ్చేయాలని పోలిగాడి ఆలోచన!

అట్లా నాలుగైదు ప్లేస్కూళ్లలో పనిచేసే అటెండర్ల స్నేహం కుదరటతో తన మనసులో ప్లాను వివరించి వారి వాటా వారికి ముట్టచెప్తానన్నాడు. పెద్ద మొత్తం డబ్బొస్తుందనే ఆశతో పోలిగాడి ప్లాన్‌కు తలలూ పొరు అడ అటెండర్లు.

× × × × ×

పిల్లలు ఎక్కువ సంఖ్యలో కిడ్నాప్‌కు గురికావటం అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర కలకలం రేపటంతో పోలీసు డిపార్టుమెంట్ ఎలర్ట్ అయింది.

ఈవిషయం పోలిగాడికి తెలియటంతో పోలీసులకు ఎక్కడ దొరికిపోతాడోనే భయంతో ఈవ్యాపారానికి దూరంగ వుంటూ వచ్చాడు.

జేబులో డబ్బుల్లేక సారాతాగటం బాగా తగ్గించటంతో మనిషిలో తిక్క చోటు చేసుకుంది. వంట్లో నరాలు వశంతప్పుతున్నట్టు... నీరసించిపోతున్నట్టు అన్పించటంతో మళ్లీ పెళ్లామే గతైంది. పెళ్లాన్ని అదిలించి బెదిరించి గుంజుకున్న డుబ్బుతో గొంతుతడి చేసుకుంటున్నాడన్న మాటేగానీ... పూటుగ తాగగలిగేననే తృప్తి వుండకపోవటంతో అతని మనసు మళ్లీ దొంగతనాల వైపు మళ్లింది.

'వద్దు మావా... నువ్ మళ్లీ పాడుపన్ల జోలికి పోవద్దు... నామాట యినుకో...' అంటూ యాదమ్మకాళ్లవేళ్లా పడింది.

అదీ నిజమే! ఈ మధ్య పోలీసోళ్ల బెడద ఎక్కువగానే వుంది. ఏక్షణంలో నైనా దొరికిపోవచ్చునే భయం పీడిస్తోంది.

'ఇదిగో ఇటుసూడు... పసిదాన్ని వుయ్యాల్లో పండబెట్టినా... అది నిద్దరోతోంది. నెలజీతం కోసం నేను పెద్దపిల్లతో ప్లీడరు గారింటికెళ్లొత్తా... ఇంటికాడే జాగర్తగా వుండు' అని చెప్పి కూతురితో రోడ్కెక్కింది యాదమ్మ.

అర్ధగంటలో యాదమ్మ పెద్ద కూతురు తిరిగి ఇల్లు చేరుకున్నారు. మొగుడు మంచంలో అవుపించలేదు. ఉయ్యాల్లో పిల్ల కూడా కానరాకపోవటంతో యాదమ్మ కలవరపడింది. రెండోది మూగది కావటాన వాళ్ల సంగతి దాన్ని ప్రశ్నించినా చెప్పలేదు. మూడో కూతురు అప్పుడే వచ్చి తనతోటి పిల్లలతో ఆడుకుని వస్తున్నానని చెప్పింది. ఏం జరిగివుంటుంది. మొగుడు పిల్లా ఒక్కసారే కన్పించకుండా పోవటం విచిత్రంగా తోచింది యాదమ్మకు. మనిషిలో భయం కంగారు చోటు చేసుకోవటాన ఇరుగుపొరుగు వాళ్లని వాకబు చేసినా వాళ్లకు తెలియదనటంతో ఆమెలో దుఃఖం పెల్లుబికింది

కాస్సేపు పిచ్చిదానిలా చిందులు తొక్కింది... అయోమయంతో జుట్టు పీక్కుంది. బిడ్డ ఏమై వుండాలి? అనేసి పరిపరివిధాల మథనపడుతూండగా మొగుడు తాగి తూలుకుంటూ రావటం చూచింది.

ఆడు దగ్గరాగనే 'బిడ్డనొదిలేసి నువ్వు తాగటానికి వెళ్లావేందయ్యా...?'- బాధతో అడిగింది.

'బిడ్డ వుయ్యాల్లో నిద్రపోతోంది కదా... నువ్వొచ్చే లోపు రాలేకపోతానాని సారా దుకాణానికి వెళ్లి రెండు పొట్లాలు తాగి... నాలుగు సీకులు చీకి... వత్తావుండానే...'

'పిల్లవుయ్యాలోలేదయ్యా పాలుతాగేవేళ... పసిది ఏమైందో ఏమో?.. గుక్కపెట్టి ఏడుత్తా వుండాలి... ఈడంతా వెతికినా... ఎవరికీ తెలీదన్నారు... ఇప్పుడెట్లాగయ్యా!- ఏం చేద్దాం?-' కన్నీరు మున్నీరుగ విలపిస్తూ అంది.

'ఓసి ముదరష్టపు దానా.. అసలు తప్పంతా నీదే.. నువ్వే దాన్ని చంకనేసుకుని పోయివుంటే బాగుండేది కదా... నీ పన్లన్నీ ఇట్టనేవుంటయ్... ఇప్పుడేమో పిల్ల కనబడకపోయె...'

'ఎల్లవయ్యా... నాలుగు వీధులు తిరిగి అదియాడైనా అగుపడతదేమో... వెతుక్కురావయ్యా...'

'అట్టాగే ఎడతాను గానీ... బువ్వెట్టవే నాకు ఆకలేస్తోంది...' పెళ్లాన్ని తొందర చేశాడు.

'నువ్ నా కూతుర్ని ఎతికితెస్తేనే గాని నీకు బువ్వెట్టను... ఎల్లు... వెతక్కురావయ్యా...'

'అంతేనా? అది దొరక్కపోతే...'

'దొరక్కుండా యాడికిపొద్ది?'

'ఏమో... నాకేం తెల్సు?-'

పోలిగాడికి అంతా తెలుసు! ఉయ్యాల్లో కూతుర్ని తీసుకెళ్లి అమ్మేసి పాతికవేలు తెచ్చుకున్నా... పైకి ఏమీ ఎరుగని నంగనాచిలా ముఖం పెట్టాడు. తన చేతులతో తానే కన్నబిడ్డని అమ్మేసిన దుర్మార్గుడు. కేవలం తాగుడు కోసం జల్సాల కోసం భార్యకు తెలియకుండా అమ్ముకున్న రాక్షసుడు.

తాను నిజం వప్పుకోలేకపోతున్నాడు. భార్యను వంచించి అబద్ధాలు చెప్తున్నాడు.

వెతుకుతానని చెప్పి వెళ్లిన వాడల్లా వెళ్లి సారాదుకాణం చేరుకుని మళ్లీ తాగాడు. హోటల్లో బిర్యానితో కడుపు నింపుకున్నాడు. గుడిసె కాడేమో యాదమ్మ ఏడుస్తూ పిల్లను మొగుడు వెతికి తెస్తాడని ఎదురుచూస్తున్న ఆమెకు మొగుడు వంటరిగా రావటం చూచి 'ఏమయ్యా పిల్లేది?' నిలదీసింది!

తిండితిప్పల్లేకుండా ఊరంతా గాలించినా యాడా అగుపడలేదే... నన్నేం చేయమంటావ్? నాకూ బాదగానే వుందే...' మంచం మీద వాలిపోయాడు వంటిన వున్న చొక్కా చెట్టు కొమ్మకు తగిలించి పోలిగాడి నిద్రలోకి వొరిగిపోయాడు. గాలికి చెట్టు కొమ్మకు తగిలించిన చొక్కా నేలమీద పడటంతో జేబులో వున్న డబ్బు చిందర వందరగ పడటం యాదమ్మ చూసింది.

'వామ్మో! ఇంతడబ్బే?... ఈ డబ్బు యాడిది? కొంపదీసి పిల్లను తీసుకెళ్లి అమ్మి డబ్బు చేసుకోలేదు కదా' అనుమానం యాదమ్మ మనసులో పొడచూపింది.

డబ్బంతా ఏరి తన బొడ్లో దోపి దాచింది. మెలకువరాగానే పోలిగాడు లేచి వళ్లు విరచుకుని 'పొయ్యి మీద కుండలో వేన్నీళ్లు కాయవే తానం సెయ్యాల వళ్లంతా పులసరి కంపు కొడతా వుంది..' అంటూ లేచి చొక్కా అందుకున్నాడు.

జేబులో డబ్బు లేకపోవటంతో కంగారుపడ్డాడు.

'ఒసేవ్ యాదీ... నాసొక్కా జేబులో డబ్బుండాలి... నువ్వు గాని తీసినావా?' పెళ్లాన్ని నిలదీశాడు.

'నీకాడ డబ్బుయాడిదయ్యా?-' గుడ్లురిమి గదమాయించింది.

'ఎక్కడిదేంది... నాదే?-' బుకాయించాడు.

'నువ్వేమైనా కలకటేరుద్దోగం చేసుత్తుండావా ఏంది అంత డబ్బు నీకాడుంటానికి?- నాకు ఇప్పుడు అర్థమౌతోంది... మన బిడ్డను నువ్వే అమ్మి డబ్బు చేసుకున్నావ్... నిన్ను సమించనురా బైటికిలాగి రేయ్... అంటూ చూర్లో వున్న కొడవలి బైటికి లాగి'నిన్ను సంపేత్తాన్రోయ్... నిన్ను బతకనీయను. ఎంతకసాయోడివిరా నువ్వు?... నా కళ్లు కప్పి... ఎదవ డబ్బు కోసం కక్కుర్తి పడి కన్న బిడ్డనే అమ్ముతావా?- నిన్ను బతకనీయను... నీలాంటోడు భూమ్మీద వుండ కూడదు...' రాక్షస సంహారానికి తలపడిన దుర్గాదేవిలా కొడవళి చేతపూని మొగుడ్ని నరికి చంపబోయింది.

బెదిరిపోయిన పోలిగాడు ప్రాణభయంతో కాలికి బుద్ధి చెప్పాడు!!

(సమాప్తం)